ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ప్రభుత్వంతో పాటు కార్పొరేట్, ప్రైవేటు వైద్య సంస్థలు పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని గంగపుత్ర సంఘం హాల్‌లో 'సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్టార్ ప్రేమ్ ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేదలు నివసించే ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వారికి అండగా నిలవాలన్నారు. ఎస్‌ఆర్డీ సంస్థ సామాజిక బాధ్యతతో కరోనా కాలం నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరంలో ఈసీజీ, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, గైనిక్ పరీక్షలు, బీపీ, షుగర్ తదితర పరీక్షలతో పాటు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ, ఎస్‌ఆర్డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు, రహీం, జునేద్ బాగ్దాదీ, శంకర్‌గౌడ్, సాయి, మగ్బూల్, జబ్బార్, నాయకులు కృష్ణ, ప్రవీణ్, వంగాల నర్సింగ్‌రావు, ఎస్‌ఆర్డీ సంస్థ ప్రతినిధులు శివరాణి, ఇందిరాభారతీ తదితరులున్నారు.

బిజినెస్ మేనేజ్‌మెంట్‌తో ఉజ్వల భవిష్యత్


సమావేశంలో పాల్గొన్న ఐసీఎస్‌ఎస్‌ఆర్-ఎస్‌ఆర్సీ డైరెక్టర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు

కాచిగూడ: బిజినెస్ మేనేజ్‌మెంట్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐసీఎస్‌ఎస్‌ఆర్- ఎస్‌ఆర్సీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆర్.జి.కేడియా కాలేజ్ ఆఫ్ కామర్స్, ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఐసీఎస్‌ఎస్‌ఆర్ – ఎస్‌ఆర్సీ, టీజీసీహెచ్ఈ సంయుక్తాధ్వర్యంలో కాచిగూడలోని కేడియా కాలేజీలో 'భవిష్యత్ వ్యాపార ధోరణులు – నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఓయూసీసీ అండ్ బీఎం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ, ఐపీఈ అండ్ కార్పొరేట్ ట్రైనర్ ప్రొఫెసర్ ఎంఎల్. సాయి కుమార్, ఓయూ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాస్ కుమార్, మినాల్, సీఏ ఎస్.బి.కాబ్రా, రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వందన సాంబ, డాక్టర్ శ్రీనివాస్‌కుమార్, డాక్టర్ కేవీఎస్ సుధాకర్, డాక్టర్ డీవీఎస్. ప్రదీప్, కమలేష్ మిట్టల్ తదితరులు పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో దేశ, విదేశాల్లో విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయన్నారు. ఔత్సాహిక యువ పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ కంపెనీలు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్న యువతీ యువకులు తమ కలలను సాకారం చేసుకునేందుకు అవకాశాలపై సదస్సులో పలువురు ప్రముఖులు వివరించారు. విద్యార్థులకు మేనేజ్‌మెంట్ విద్యపై ఉన్న సందేహాలను నివృత్తి చేసి, ఉత్తమ అవకాశాలపై అవగాహన కల్పించారు.

బెంగుళూర్‌లో కాపు ఐక్య వేదిక మహాసభలు


సమావేశంలో డాక్టర్ కొండ దేవయ్య పటేల్

కాచిగూడ: భారతీయ కాపు ఐక్యవేదిక జాతీయ మహాసభలను బెంగుళూర్‌లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ తెలిపారు. శనివారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల బెంగుళూర్‌లో జరిగిన భారతీయ కాపు ఐక్యవేదిక ప్రతినిధుల సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. జాతీయ చైర్మన్‌గా వేణుగోపాల్‌నాయుడు, జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ కొండ దేవయ్య, జాతీయ గౌరవ అధ్యక్షుడిగా తులసి రామచంద్రప్రభును ఎన్నుకున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో పిలువబడుతున్న కాపులందరినీ ఒకే వేదికపై తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల్లో కాపు ఐక్యవేదిక కమిటీలను పూర్తి చేయనున్నట్లు వివరించారు. కాపు ఐక్యవేదిక జాతీయ మహాసభలకు జనసేన అధినేత, కాపు నేత ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఆయన ఇచ్చిన తేదీ ప్రకారం బెంగుళూర్‌లో జాతీయ మహాసభలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఎం.ఏసుబాబు, ఆర్. మహేందర్‌కుమార్, రమణమూర్తి, ఉదయ్ భాస్కర్, సత్య శేఖర్, ఆకుల నర్సింగ్‌రావు, బాలకృష్ణ, శివ పటేల్ తదితరులున్నారు.

ఆత్మీయ సన్మానం


కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఈఓ దేవనాథం

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ అంజనేయ స్వామి దేవాలయంలో అర్చకుడు కే.కృష్ణమూర్తి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఈఓ మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్ కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కృష్ణమూర్తి గత మూడున్నర దశాబ్దాలుగా భువనేశ్వరిదేవి అమ్మవారి ఆలయ ప్రధాన పూజారిగా పనిచేసి భక్తుల, ఆలయ అధికారుల మన్ననలను పొందారన్నారు. తోటి అర్చకులు వేంకటాద్రి, సిబ్బంది ఎస్‌బీవీఎస్ ఆచారి, శివ, పావని, దేవాలయం ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.కృష్ణమాచారి, గ్రేటర్ అధ్యక్షుడు జగపతి, మాజీ ధర్మకర్తలు ముచ్చకుర్తి ప్రభాకర్, జానకి సుధాకర్, గణేష్, జాట్ నగర అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారతీయ సంగీత నృత్యోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ నటరాజ నృత్య నికేతన్, శ్రీ లలిత కళా నృత్య నికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో 'శంభో శివ శంభో' పేరిట శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన నృత్యోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన భరతనాట్యం, కూచిపూడి నిత్యం అదరహో అనిపించింది. చినుకు కల్చరల్ సొసైటీ వ్యవస్థాపకులు, ప్రముఖ కవి పి.ఎస్.మూర్తి, నిర్వాహకులు భారతీ, రమణిసిద్ధి, నాట్యాచార్యులు తాతా వెంకటవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు ప్రముఖులను సత్కరించారు.

చిక్కడపల్లి: అభినయ దర్పణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో వోలేటి రంగమణి, రేఖల శిష్యబృందం కూచిపూడి నాట్యనీరాజనం ఆకట్టుకుంది. వినాయక స్తుతితో ప్రారంభించి దశావతారం, భువనేశ్వరీస్తుతి, అంబనీరాజనం అంశాలతో నృత్యప్రదర్శనతో కళాకారులు అలరించారు. ప్రముఖులు సీహెచ్. త్రినాథరావు, చక్రపాణి, సుధారామరాజు పాల్గొన్నారు.

మాజీ మంత్రి, పీసీసీ చీఫ్ డీఎస్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: సీనియర్ రాజకీయ నేత, మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి సంతాపం ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసి డీఎస్ కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ధర్మపురి శ్రీనివాస్ ఆకస్మిక మృతిపై భారతీయ కాపు ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య, ఉపాధ్యక్షుడు ఆర్.వీ.మహేందర్‌కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. బాజిరెడ్డి గోవర్దన్, ఎడ్ల రవి పటేల్, దేశెట్టి శివ పటేల్, ధర్మపురి ప్రకాష్ తదితరులున్నారు.

అప్రమత్తతే అతిసారకు మందు

తాజా ఆహారం తీసుకోవాలి • కాచి చల్లార్చిన నీటినే తాగాలి


డా. శంకర్, ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్

నల్లకుంట: వర్షాకాలంలో అతిసార వ్యాధి ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి భారిన పడిన వారు నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయానికి దారితీస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు తాజా ఆహార పదార్థాలను భుజించడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలను పాటిస్తే వ్యాధి భారిన పడకుండా ఉండొచ్చని నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. శంకర్ సూచించారు.

ఈ వ్యాధి కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

వ్యాధి ప్రబలే కాలంలో క్లోరిన్ కలిపిన నీటినే విధిగా తాగాలి. కాచి చల్లార్చిన నీటిని తాగినా మంచిదే.

- కుండ లేక బిందెల్లో చేతులు ముంచి తాగునీటిని తీసుకొని తాగకూడదు. కాడ గిన్నెతో నీటిని గ్లాసులో పోసుకుని తాగడాన్ని అలవాటు చేసుకోవాలి.
- పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం.
- చేతి పంపులు, కుళాయిల చుట్టూ పళ్లాల ఆకారంలో ప్లాట్‌ఫారాలను నిర్మించుకోవాలి.
- వేడి ఆహార పదార్థాలను తినే మంచి అలవాటు చేసుకోవాలి. నిల్వ ఉన్న మాంసాహారంతో పాటు ఎలాంటి నిల్వ పదార్థాలను తిన కూడదు.
- ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలి. భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత విధిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి.
- ఇంటి పరిసరాలతో పాటు బహిరంగ మల విసర్జన చేయకూడదు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వాడటాన్ని అలవాటు చేసుకోవాలి.
- మంచి నీటి చెరువులు, బావులు, బోర్ల వద్ద బట్టలు ఉతకడం చేయకూడదు. ఇంటి పరసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- సూక్ష్మ క్రిములు లేకుండా పరిసరాల్లో మురుగు వ్యర్థాలు నిల్వలేకుండా చూసుకోవాలి. వంట గదిలో ఈగలతో పాటు ఇతర కంటికి కనబడని కీటకాలు సైతం చేరకుండా ఉండేందుకు వంట పాత్రలపై మూతలు ఉంచాలి.
- మాంసం, కూరగాయలు, ఫలాలు వినియోగించేందుకు ముందు నీటితో శుభ్రంగా కడగాలి. వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. వంట చేసే ముందు, భోజనం వడ్డించేందుకు ముందు, పిల్లలకు డైపర్స్ మార్చిన తర్వాత కూడా సబ్బుతో గోళ్లతో సహా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- గోళ్లను ఎక్కువగా పెరగనివ్వకూడదు. ఏ ప్రాంతంలోనైనా అతిసారం ఉన్నట్లు అనుమానం వస్తే జీహెచ్‌ఎంసీ ఆరోగ్య విభాగం అధికారులకు సమాచారం అందించాలి. అతిసార బారిన పడిన వారు సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ప్రమాదం.

వీటికి దూరంగా ఉండాలి..

- శుద్ధి చేయని నీటిని తాగకూడదు. ఆ నీటితో తయారైన జ్యూస్‌లు, పానీయాలు, ఐస్, ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉండాలి.
- రోడ్డు పక్కన వీధుల్లో విక్రయించే ఆహారం, మాంసాన్ని తినకూడదు.
- పచ్చివి, వండని ఆహారాన్ని, మాంసం, మద్యం, ఇతర పానీయాలకు దూరంగా ఉండాలి.
- మసాల పదార్థాలు తగ్గించడంతో పాటు కాఫీ, టీలు పరిమితం చేయాలి.

పరామర్శ


పరామర్శిస్తున్న మధ్యప్రదేశ్ ఎంపీ గణేష్‌సింగ్

కాచిగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి భాగ్యలక్ష్మి భర్త రాజారామ్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మధ్యప్రదేశ్ ఎంపీ గణేష్‌సింగ్ హైదరాబాద్ నగరంలోని భాగ్యలక్ష్మి నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఓబీసీల సంక్షేమానికి గణేష్‌సింగ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఓబీసీ సెంట్రల్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ముషీరాబాద్: బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ శనివారం అడిక్‌మెట్ డివిజన్ అచ్చుత్‌రెడ్డి మార్గ్‌లో పర్యటించారు. గత రెండు నెలలుగా అచ్చుత్‌రెడ్డి మార్గ్‌లో తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు ఫోన్ చేసి సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మూడ్రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు కడప సురేందర్, పవన్, అస్లాం, జగదీష్, అనురాధ, కవిత, ప్రియాంక, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్కారం

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ కృష్ణానగర్ బస్తీ నుంచి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వై.శాంతికుమార్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శనివారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేగా తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. బస్తీ వాసులు రాజ్‌కుమార్, స్వామిరావు, మహేందర్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వినతి

చిక్కడపల్లి: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కోరారు. శనివారం డివిజన్‌లోని పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. కచ్చా నాలాలో పేరుకుపోయిన పూడికతీత, దేవాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడంతో పాటు పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తను తొలగించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.


జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

ధైర్యంతో ముందుకెళ్తేనే విజయం

అదనపు డీజీపీ మహేష్ భగవత్


మహేష్ భగవత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న స్వామి బోధమయానంద

కవాడిగూడ: జీవితంలో రిస్క్ తీసుకుని ప్రయత్నించినవారే విజేతలవుతారని లేదంటే అనుభవజ్ఞులుగా మిగిలిపోతారని అదనపు డీజీపీ మహేష్ భగవత్ యువతకు సూచించారు. శనివారం రామకృష్ణ మఠంలో జరుగుతున్న ''శౌర్య'' శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... యూపీఎస్సీ అభ్యర్థులకు ఇంటర్వ్యూను ఎదుర్కొనే విషయంపై ఫ్రీ కోచింగ్ ఇస్తున్నామని 2024లో 1016 మంది విద్యార్థులకు ఫ్రీ కోచింగ్ ఇవ్వగా.. అందులో 216 మంది క్వాలిఫై అయ్యారని, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అనన్య 3వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ ఫ్రీ కోచింగ్‌లో చేరాలనుకునే విద్యార్థులు 9440700105 వాట్సాప్ నెంబర్‌కు వివరాలు పంపించాలని మహేష్ భగవత్ తెలిపారు. శౌర్యా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు టైం మేనేజ్‌మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ ఏ విధంగా జయించాలనే విషయంపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద మాట్లాడుతూ... సమాజానికి టెక్నాలజీతో పాటు యువతీ యువకుల అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వామి వివేకానంద బోధనలు అనుసరిస్తూ జీవితాలను ఉద్ధరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి


ధర్నాలో అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నేతలు

కవాడిగూడ: విద్యాహక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు పర్చాలని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. అధిక ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొచ్చేంత వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. విద్యాహక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బహుజన ప్రజాశక్తి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ నల్లా లక్ష్మణ్, ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ అగ్ర కుల నిరుపేద హక్కుల ఉద్యమ వేదిక సంయుక్తాధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు బీసీ సంఘం నేత వీజీఆర్ నారగోని, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీ.ఎన్ రమేష్‌కుమార్ మాదిగ, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్, బహుజన ప్రజాశక్తి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ నల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ... గడిచిన 77 ఏళ్ల నుంచి దేశంలో పాలకులు విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం వల్ల నేటికి అక్షరాస్యత శాతం 87 శాతానికి పరిమితమైందని, విద్యా రంగంలో ప్రైవేటు యాజామాన్యాల అజమాయిషీ పెరిగిపోవడంతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదవులు చదువుకోవడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చట్టం అమలు చేసేంతవరకు తమ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. గోపీ, నాయకులు ప్రదీప్, రమేష్, బాలనర్సింహ, స్వామి, భూషణ్, నర్సింగ్‌రావు, నాగేష్ వివిధ జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

నీట్ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాడతాం


పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వివిధ విద్యార్థి సంఘాల నేతలు

ముషీరాబాద్: నీట్ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని జూలై 1న రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని విద్యార్థి, యువజన సంఘాల నేతలు స్పష్టం చేశారు. శనివారం మధ్యాహ్నం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం జరిగింది. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు విష్ణువర్దన్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్, విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు అరుణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఆజాద్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జావేద్, ఏఐవైఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరి సాగర్, ప్రదీప్, వైజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు సలీం తదితరులు పాల్గొన్నారు. సమస్య గురించి చర్చించేందుకు తెలంగాణ గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన ఇంత వరకు స్పందించలేదని తప్పనిసరి పరిస్థితుల్లోనే జూలై 1వ తేదీన ఛలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీట్ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దుచేసి నీట్ ప్రవేశ పరీక్షలు తిరిగి నిర్వహించాలన్నారు. నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జీతో సమగ్ర దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నల్లకుంట: ఓయూ రోడ్డులోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళాసభ (డీడీఎంఎస్) లిటరసీహౌజ్‌లో మహిళల కోసం గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నారు. ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్, టాలీ ప్రైమ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని డీడీఎంఎస్ లిటరసీ హౌజ్ కార్యదర్శి డాక్టర్ నాగలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, డిజైనర్ బ్లౌజ్, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెహిందీ డిజైనింగ్, హెయిర్ స్టైల్ తదితర షార్ట్ టర్మ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. జూలై 8 దరఖాస్తులకు చివరి తేదీ అని తెలిపారు. వివరాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 99512 10441/ 70134 57432.

8 నుంచి శ్రీకాళి దుర్గా వైష్ణవి మహాయంత్ర పూజ

కాచిగూడ: బర్కత్‌పురలోని శ్రీ మహాకాళి దుర్గా వైష్ణవి దేవి, నల్ల పోచమ్మ దేవాలయంలో జూలై 8వ తేదీ నుంచి శ్రీ కాళీ దుర్గా వైష్ణవి దేవి మహాయంత్ర పూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఆగస్టు 11 వ తేదీ వరకు ఈ పూజలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అర్చన, పూజ, హారతి ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు. వివరాలకు 9502527076.

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్


మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: పేదల వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఎంతో దోహదం చేస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సీఎం రిలీఫ్‌ఫండ్ పథకం కింద అంబర్‌పేటకు చెందిన పి.ఆలోక్‌కు నిమ్స్ ఆసుపత్రిలో వైద్యం కోసం మంజూరైన రూ. లక్ష మంజూరు పత్రాన్ని శనివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు అండగా ఉండేందుకు కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను మినహాయించే జీవోను ఉపసంహరించుకోవాలి

చిక్కడపల్లి: ఐటీ, ఐటీఈఎస్ పరిశ్రమలకు కార్మిక చట్టాలను మినహాయిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 5ను వెంటనే ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద జీఓ నంబర్ 5ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ జీవోతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో భద్రత, రవాణాసౌకర్యాలు, వేతనాలు, మహిళా ఉద్యోగులకు భద్రతకు సంబంధించిన షరతులను సడలించడం సరికాదన్నారు. కొన్నేళ్లుగా ఐటీ పరిశ్రమలు, కంపెనీలను కార్మికశాఖ అధికారులు తనిఖీలు చేయడం లేదన్నారు. ఆయా సంఘాల నేతలు ఎస్.బాలరాజ్, భాస్కర్, రెబ్బ రామరావు, కె.సూర్యం, ఎంకే బోస్ తదితరులున్నారు.

నాలా పనుల పరిశీలన


అంబర్‌పేటలో నాలా పనులన పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్

అంబర్‌పేట: వర్షాకాలంలో తలెత్తే సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ అధికారులకు సూచించారు. శనివారం అంబర్‌పేట నియోజకవర్గంలో సర్కిల్–16 డీఎంసీ మారుతీదివాకర్, ఏఎంహెచ్ఓ హేమాలతతో పాటు ఇతర అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రధానంగా మొయిన్ చెరువు నాలా ప్రవహించే ప్రాంతం, నాలా పైకప్పులు, అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్యం వంటి సమస్యలను ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. వర్షాకాలంలో మౌలిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాలకు నాలాలు పొంగి పొర్లడం తదితర సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలి

చిక్కడపల్లి: కార్మికులకు మెరుగైన సేవలందించాలని, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర కార్మిక, కార్మాగారాలు, ఉద్యోగశిక్షణ ముఖ్యకార్యదర్శి సంజయ్‌కుమార్ అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ, లేబర్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్, ప్యాక్టరీస్, (ఎల్‌టీఈ, ఎఫ్)గా సంజయ్‌కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం కార్మికశాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య అధ్యక్షతన దక్షిణాది రాష్ట్రాల్లో కార్మిక సంక్షేమం అమలుకు సంబంధించిన అంశాలపై సమావేశంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ పాల్గొన్నారు. రాష్ట్ర కార్మికశాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. సంయుక్త కమిషనర్లు చతుర్వేది, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సునీత, డీసీఎల్ శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, ప్రమోద్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నీలమ్మ, చంద్రశేఖర్‌గౌడ్ అధికారులు పాల్గొన్నారు.

నేతకాని సామాజిక వర్గానికి న్యాయం చేయాలి

కవాడిగూడ: నేతకాని సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు ఆత్మగౌరవ భవనం నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ జూలై 1న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలను అందజేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం రాజేష్ ప్రకటించారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఎస్సీ కార్పొరేషన్‌తో తమ సామాజిక వర్గం పూర్తిగా నష్టపోయిందన్నారు. ఎస్సీ జాబితాలోని కొన్ని కులాలకు మాత్రమే ఉమ్మడి ఎస్సీ కార్పొరేషన్ ఉపయోగపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగం, ఆర్థికంగా, రాజకీయంగా అత్యంత వెనుకబడ్డామని ప్రభుత్వం గుర్తించి నేతకాని సామాజిక వర్గానికి చేయూతనందించాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.